



విఒఎలను విధుల్లోకి తీసుకోవాల్సిందే..

ప్రజాశక్తి -గుడ్లూరు

మండలంలో అక్రమంగా తొలగించిన విఒఎలను విధుల్లోకి తీసుకోవాలని చేపట్టిన ఆందోళన కొనసాగింది. స్థానిక వెలుగు కార్యాలయంలో వివో ఏలు అధికారులను నిలదీయడంతో అక్కడ కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. గుడ్లూరు మండలంలో విఒఎలుగా పనిచేస్తున్న 34 మందిని గత రెండు నెలల కిందట విధులు నుంచి తొలగించి కొత్తవారిని నియమించారు. దీంతో వివిఎలు హైకోర్టుని ఆశ్రయించారు. హైకోర్టు జడ్జి తొలగించిన వారిని వీధుల్లోకి తీసుకోవాలని ఆదేశించింది. అయినా జీవో విడుదల చేయడంతో అధికారులు జాప్యం చేస్తున్నారు. విఒఎలు కందుకూరు సబ్ కలెక్టర్ ని సంప్రదించి పరిస్థితిని వివరించారు.



ఆందోళన చేస్తున్న విఒఎలు

నలుగురికి నామినేటెడ్..!

- ఒకే సామాజిక వర్గానికేనా అంటూ పెదవి విరుపు
- టిడిపికి మూడు, బిజెపికి ఒకటి
- సీనియర్లు ఎదురుచూపు
- అభినందనల వెల్లువ

రాష్ట్ర ప్రభుత్వం రెండవ జాబితా నామినేటెడ్ పోస్టులను ప్రకటించింది. ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న నాయకులు నలుగురికి చైర్మన్ పదవులు దక్కాయి. ఇందులో బిజెపి ఒకటి, టిడిపి నాలుగు పోస్టులు దక్కించుకున్నాయి. సీనియర్లు అనేక మంది ఇంకా ఎదురుచూస్తున్నారు. పదవులు పొందిన నాయకులకు పలువురు అబినందనలు తెలిపారు. జిల్లాలో ఒకే సామాజికవర్గానికి చెందిన వ్యక్తులకు నాలుగు పోస్టులు కట్టబెట్టారనే విమర్శలు వస్తున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి నాయకులు మరికొందరు ఆశగా ఎదురుచూస్తున్నారు. మూడో జాబితాలో తమకు అవకాశం వస్తుందని చూస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో కీలకమైన జనసేనకు అవకాశం దక్కకపోవడం పట్ల కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసింది. గత ఎన్నికల్లో పార్టీలో కీలకంగా పనిచేసిన కొందరి నాయకులకు పదవులు వరించాయి. నుడా ఛైర్మన్‌గా మళ్లీ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి అవకాశం దక్కింది. ఎపి స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా ఆనం వెంకటరమణారెడ్డి, ఎపి ఎన్విరాన్మెంటల్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, ఎపిఎస్‌ఆర్‌టిసి రీజినల్ బోర్డు ఛైర్మన్‌గా బిజెపి సీనియర్ నేత సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని నియమించారు. వీరి నియామకంపై పలువురు అభినందనలు తెలిపారు. జిల్లాలో ఒకే సామాజిక వర్గానికి రెండో జాబితాలో పదవుల రావడం పట్ల కొందరు ఆవేదన చెందుతున్నారు. సీనియర్ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి బాలకృష్ణ అభిమానిగా పార్టీ నేతలుగా గత ఎన్నికల్లో పనిచేశారు. ఒక దశలో ఎంఎల్‌ఎ అభ్యర్థిగా ముందుకొచ్చారు. పి. నారాయణ అభ్యర్థిగా రావడంతో ఆయనను పక్కనపెట్టారు. నుడా ఛైర్మన్‌గా తిరిగి మళ్లీ నియమించారు. సీనియర్‌నేత ఆనం వెంకటరమణారెడ్డి గత ఎన్నికల్లో పార్టీ వాణిని బలంగా వినిపించారు. రాష్ట్ర కేంద్రంలోనూ, జిల్లాలోని పార్టీనేతలు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపారు. కోవూరు ఎంఎల్‌ఎ అభ్యర్థిగా చివరి వరకు పోటీ పడి, చివరి దశలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అభ్యర్థిగా రావడంతో ఆయనను పక్కనపెట్టారు. అందులో బాగంగానే ఆయనకు పదవి దక్కింది. బిజెపి సీనియర్ నాయకులు, అనేక సార్లు ఎంఎల్‌ఎగా పోటీచేసిన సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని అనుకోని పదవి దక్కింది. ఆర్‌టిసి రీజినల్ ఛైర్మన్‌గా బాధ్యతలిచ్చారు. ఆపార్టీలో సీనియర్ నేతల్లో ఆయన ముఖ్యులు రావడంతో కూటమి ప్రభుత్వంలో ఆయనకు పదవి దక్కింది. కూటమిలో ప్రధాన పార్టీగా ఉన్న జనసేనకు ఎలాంటి పదవులు రావడం లేదు. మూడో జాబితాలోనైనా తమకు అవకాశం దక్కుతుందని కూటమి నాయకులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అభినందించారు. శ్రీనివాసులురెడ్డి మంత్రి నారాయణకు పాదాభివందనం చేశారు. ఆనం వెంకటరమణారెడ్డి నివాసం వద్ద అబిమానులు పెద్ద ఎత్తున చేరుకొని అభినందనలు తెలిపారు.



ఆనం వెంకట రమణారెడ్డి



కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి



సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి



పోలంరెడ్డి దినేష్‌రెడ్డి

సీనియర్లు ఎదురుచూపు..!

కూటమి ప్రభుత్వంలో మూడో జాబితాలోనైనా తమకు అవకాశం దక్కుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. సీనియర్ నాయకులు కొమ్మి లక్ష్మయ్యనాయుడు, కంభం విజయరామిరెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, ఉదయగిరి నుంచి మేకపాటి శాంతమ్మ, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ జెడ్ శివప్రసాద్, చెంచల్ బాబుయాదవ్ బొమ్మి సురేంద్ర, భూలక్ష్మీ, పివి రావు, జన్ని రమణయ్య, తిరుమల నాయుడుతోపాటు అనేక మంది సీనియర్ నాయకులు మూడో జాబితాలోనైనా తమకు అవకాశం ఇస్తారని చూస్తున్నారు. కూటమిలోని ప్రధాన పక్షమైన జనసేనకు రెండు జాబితాల్లో స్థానం కనిపించలేదు. నూనె మల్లికార్జునయాదవ్, జి, కిశోర్, సంజయ్, తదితరులు చూస్తున్నారు. ఏం జరుగుతుందో చూడాలి.



మ ట్లాడుతున్న మంత్రి పి. నారాయణ

ఇసుక రీచ్‌లలో పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రజల జీవన స్థితిగతులు మారటానికి ఉచిత ఇసుక విధానం ఎంతగానో తోడ్పడుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు.శనివారం లోని భగత్ సింగ్ కాలనీ, దీన్ దయాళ్ నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఇసుక రీచ్ లను అధికారులతో కలిసి పరిశీలించి అక్కడ ఉన్న కార్మికులతో మంత్రి నారాయణ ముచ్చటించి, వారి స్థితిగతులు తెల్సుకుని, వారితో కలసి పారతో ఇసుక తీసి వారి శ్రమలో భాగమయ్యారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానంతో రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులకు ఉపాధి దొరికిందన్నారు. నిర్మాణ రంగం ఉపందుకుంటే, దానిమీద ఆధారపడిన వివిధ రకాలైన కార్మికులకు నిరంతర పని ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికి పని కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ అనూష, ఇతర అధికారులు, నాయకులున్నారు.

12న మందకృష్ణ పర్యటన

ప్రజాశక్తి-నెల్లూరు :ఈ నెల 12న ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ జిల్లాలో పర్యటించనున్నారని ఆ సంఘం జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ, జిల్లా అధ్యక్షులు పందిటి అంబేద్కర్ మాదిగలు తెలియజేశారు. శనివారం నగరంలోని డాక్టరు బి.ఆర్ అంబేద్కర్ భవనంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సూరిపాక ఉదయ్ కృష్ణ మాదిగ అధ్యక్షతన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎంఈఎఫ్ జాతీయ నాయకులు బెజవాడ పాపయ్య మాదిగ,ఎంఈఎఫ్ రాష్ట్ర నాయకులు వేగూరి వెంకటేశ్వర్లు మాదిగ, మాదిగ, విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు తాటిపర్తి అంకబాబు,విహెచ్‌పిఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు గున్నం సుజాత, ఎంఈఎఫ్ నాయకులు చేవూరి వర ప్రసాద్ పాల్గొన్నారు.

శరవేగంగా పూడికతీత పనులు : పొంగూరు

ప్రజాశక్తి -నెల్లూరు

ఇరిగేషన్ కాలువల్లో పూడికతీత పనులను డ్రోన్ కెమెరాతో చిత్రీకరించాలని సంబంధిత అధికారులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు.శనివారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో జిల్లా కలెక్టర్ ఆనంద్ తో కలసి ఇరిగేషన్, విద్యుత్ శాఖల పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారుమంత్రి మీడియాతో మాట్లాడుతూ, ఇరిగేషన్ కాలువల్లో పూడికతీత పనులకు ఇప్పటికే రూ. 50 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. రెండు రోజుల్లో టెండర్లు పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామన్నారు. తమ ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా పనిచేస్తున్నదనటానికి డ్రోన్స్ కెమెరాలను వినియోగించడమే నిదర్శనమ న్నారు. నిన్నటి ఐఎబి సమావేశంలో రైతులు , రైతు సంఘాల నాయకులు రైతులకు విద్యుత్తు 7 గంటలు మాత్రమే అందిస్తున్నారని, అదేవిధంగా కొన్ని ప్రాంతాల్లో ట్రాన్స్ఫార్మర్లు కాలిపోయాయని సమావేశం దష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాలను పరిశీలించిన మంత్రి నారాయణకలెక్టర్ తో కలసి ఇరిగేషన్, విద్యుత్ అధికారులతో సమావేశమై కూలంకషంగా చర్చించారు.విద్యుత్ శాఖ ఎస్ ఇ విజయన్ తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ ఇ వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

ఉద్యోగాలకు 'ప్రకాశం' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-కందుకూరు

రెండు లక్షల నలభై వేల రూపాయల వార్షిక వేతనంతో 50 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు టివియస్ బ్రేక్స్ ఇండియా లిమిటెడ్ కి ఎంపికైనట్లు ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె. విజయ్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కంపెనీ హెచ్‌అర్ రాజమోహన్ కాలేజీలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో 64 మంది విద్యార్థులు హాజరుకాగా 50 మంది ఉద్యోగార్హులుగా నిర్ణయించారని విజయ్ శ్రీనివాస్ తెలిపారు. డిసెంబర్ నెలాఖరులోగా ఎంపికైన వారు చెన్నైలోని టివియస్ కంపెనీలో జాయిన్ కావలసి ఉంటుందని రాజమోహన్ పేర్కొన్నారు. డిగ్రీ వచ్చేవరకు నెలకు 14 వేల వేతనంతో పాటు ఉచిత రవాణా వసతి కల్పిస్తుందన్నారు. డిగ్రీ కంపెనీకి అందించగానే ఏడాదికి రెండు లక్షల వేతనానికి ప్రమోట్ చేస్తామని హెచ్‌అర్ వెల్లడించారు. ప్రముఖ కార్పొరేట్ కంపెనీకి ఒకేసారి 50 మంది ఎంపిక కావడం కాలేజీ విద్యార్థుల సమర్థతకు తార్కాణమని కరస్పాండెంట్ కంచర్ల రామయ్య హర్షం వ్యక్తం చేసారు. ఇంటర్వ్యూ కార్యకలాపాలను కాలేజీ అకాడమిక్ ఇంచార్జ్ ఎస్‌యం.మీరావలి, మెకానికల్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కే. కోటయ్య, ప్లేస్మెంట్ కార్యాలయ ఇంచార్జ్ సుమలతలు పర్యవేక్షించారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

'విఎస్‌యు'లో డ్రోన్ పైలెట్ శిక్షణ

ప్రజాశక్తి -వెంకటాచలం :విక్రమ సింహపురి యూనివర్సిటీ డ్రోన్ పైలట్ శిక్షణ ప్రారంభించనున్నారు. డ్రోన్ సాంకేతికతలో పారిశ్రామిక నైపుణ్యాలు, ఔత్సాహికులను ప్రోత్సహించేందుకు, వి సి ఆచార్య ఎస్. విజయ భాస్కర రావుతో డ్రోన్ కంపెనీ ప్రతినిధులు చర్చలు జరిపారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన డ్రోన్ ఎక్స్‌ఓలో వారు పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో సింహపురి యూనివర్శిలో ఈ డ్రోన్ సాంకేతికత పరిశోధనా స్టేషన్, విద్య,పరిశోధన, నైపుణ్య అభివద్ధి, స్టార్టప్ మద్దతు వంటి అంశాలపైశిక్షణ ఇవ్వనున్నారు. ప్రధానంగా వ్యవసాయం, అంతరిక్షం, లాజిస్టిక్స్, నీటి, పశుపెంపకాలు, పట్టణాభివద్ధి, మౌలిక సదుపాయాలు, అటవీ వంటి రంగాల్లో సేవల వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. డ్రోన్ పైలట్ శిక్షణా కార్యక్రమం గ్రాడ్యుయేట్లు, వ్యవసాయ రంగంలోని మహిళలకు ఉపాధి అవకాశాలను పెంచే నైపుణ్యాలను అందించడంలో సహాయపడుతుందన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె సునీత, రితేశ్ కుమార్ జనరల్ మేనేజర్, ఆర్ ఫ్లై ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, బరహాలికర్ నరసింగ్ రావుపాల్గొన్నారు.



విసితో విజయ భాస్కరరావుతో కంపెనీ ప్రతినిధులు

ఉచిత పశువైద్య శిబిరం

ప్రజాశక్తి -వెంకటాచలం :మండలం లోని పాలిచర్లపాడు గ్రామంలో మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో కనుపూరు పశు వైద్య అధికారి డాక్టర్ శ్రీ లక్ష్మి మరియు మండవ ఫౌండేషన్ పశు వైద్య అధికారి డాక్టర్ శ్రీనివాసులు నాయుడు వైద్య పరీక్షలు నిర్వహించారు.

కృష్ణపట్నం పోర్టుకు భారీ నౌక

ప్రజాశక్తి - తోటపల్లిగూడూరు :అదాని కష్ణపట్నం పోర్టులో శనివారం భారీ నౌక లంగరు వేసింది. ఈ నౌక నుంచి రికార్డ్ స్థాయిలో ఐరన్ ఓర్ దిగుమతి జరుగుతోంది. పోర్టులోని ఐదో నెంబర్ బెర్త్‌లో ఈ భారీ నౌక లంగర్ వేసింది. నౌక నుంచి జే.ఎస్. డ బ్ల్యూ స్టీల్స్‌కు మొత్తం 193,402 మెట్రిక్ టన్నులుతో పోర్ట్ లో అత్యధిక ఐరన్ ఓర్ దిగుమతి చేసేందుకు ఎంవీ మినరల్ ఉటామారోను దిగుమతి జరుగుతోంది. కెప్టెన్‌ను పోర్ట్ అధికారులు ఘనంగా సత్కరించారుఆదాని కష్ణపట్నం పోర్టు సీఓఓ రాజన్ బాబు, మెరైన్ హెడ్ కెప్టెన్ రజత్ గార్గ్, కెప్టెన్ బి సాహూ హౌస్ మెరైన్, సెక్యూరిటీ హెడ్ మేజర్ వెంకటేష్, భాస్క రబీ మరియు పోర్ట్ కంట్రోల్ మెరైన్ ఇన్‌చార్జి జునాద్ షేక్, ఈ అద్భుతమైన సాధనకు గుర్తింపుగా షిప్ మాస్టర్‌కు మెమెంటోను అందించి అభినందించారు.

నేడు సిపిఎం ప్రజా పోరు

ప్రజాశక్తి - తోటపల్లిగూడూరు :ప్రజా సమస్యలపై ఈనెల 9వ తేదీ నుంచి జరుగుతున్న సిపిఎం ప్రజా పోరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కలిగించేందు కోసం శనివారం ఆయన తోటపల్లిగూడూరు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా పేడూరు గ్రామంలో లక్ష్మయ్య మాట్లాడుతూ నేడు 10 గంటలకు నరుకూరు సెంటర్ నుండి ప్రజాపోరు కార్యక్రమం ఉంటుందన్నారు. పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-కందుకూరు :పట్టణంలో గత కొన్నేళ్లుగాప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ వస్తున్న పేదలకు నెలవారి రేషన్ పంపిణీ కార్యక్రమం శనివారం చేపట్టారు. ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ ఫౌండర్ సెక్రటరీ షంషేర్ కుమార్తె అయిన షైక్ షహబాజ్ కి ఉద్యోగం వచ్చి మొదటి జీతం తీసుకున్న సందర్భంగా జీతంలో నుండి కొంత డబ్బులతో పేదవారికి ఏదైనా చేయాలన్న తపనతో అందజేశారు. ఆ డబ్బులతో ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ ఈ శనివారం పేదలకు రేషన్ పంపిణీ చేసింది. ఫౌండేషన్ సెక్రటరీ షంషేర్, ట్రజరర్ హఫీజ్, షంషఉద్దీన్ పాల్గొన్నారు.

నరసింహ యాదవ్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కందుకూరు :యాదవ కార్పొరేషన్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ ఛైర్మన్‌గా నియమితులైన గోళ్ల నరసింహ యాదవ్ కి కందుకూరు టిడిపి పట్టణ కార్యదర్శి ముచ్చు శ్రీనివాసులు యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఛైర్మన్‌గా ఎన్నికైన నరసింహ యాదవ్ రాష్ట్రంలోని యాదవుల సంక్షేమ కోసం కృషి చేయాలని ముచ్చు ఆకాంక్షించారు.

కొనసాగుతున్న సిపిఎం ప్రజా పోరు



నెల్లూరులో..

ప్రజాశక్తి-నెల్లూరు :సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ 'ప్రజా పోరు కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించారు. శనివారం ఈ ప్రజా పోరు కార్యక్రమాన్ని ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ నుండి శెట్టిగుంట రోడ్డు సెంటర్ వరకు చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం మోహన్ రావు ప్రారంభించారు. ఆత్మకూరు బస్టాండ్ నుంచి బయలుదేరిన ప్రజాపోరు యాత్ర స్టోన్ హౌస్ పేట,పప్పుల వీధి మీదుగా శెట్టిగుంట రోడ్డు సెంటర్ వరకు కొన సాగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. మోహన్ రావు, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు జి.నాగేశ్వరరావు, షేక్ మస్తాన్‌భీలు ప్రసంగించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం దేశంలో కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెట్టడమే ధ్యేయంగా పాలన సాగిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు, ఇందన సర్దుబాటు చార్జీల పేరుతో కరెంటు బిల్లు పెంచి ప్రజలపై అధనపు భారాలు మోపడం సరికాదన్నారు. . సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు పి.సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు బీపీ నరసింహ, మూలం ప్రసాద్,కె. చెంగయ్య,కత్తి పద్మ, ఎన్. వి. సుబ్బమ్మ,అల్లంపాటి శ్రీనివాసులు రెడ్డి , అత్తిమూరు శ్రీనివాసులు , ఆవుల పెంచలయ్య,షేక్ రషీద్, పి.వేణు, కే ఏమేలు, శాఖ కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.



కోవూరులో..

ప్రజాశక్తి-కోవూరు :సిపిఎం ప్రజా పోరుయాత్ర చెరువు కట్ట, గాంధీసంగం, గుమ్మళ్లదిబ్బ, కొత్త కాలనీ, పల్లిపాలెం, పాటురులో కొన సాగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు, వడ్డెర వృత్తిదారుల రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ మాట్లాడారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేతి వృత్తుల నుంచి వృత్తి దారులను దూరం చేస్తూ కార్పొరేట్ శక్తులను ప్రోత్సహిస్తున్నా యన్నారు. ప్రపంచీకరణ సరళీకరణ విధానాల వల్ల చేతి వృత్తులన్నీ ధ్వంసమై పోతున్నాయని తెలిపారు. గండవరపు శేషయ్య, గండవరపు బుజ్జయ్య, పెద్దబ్బ య్య, ఎస్‌కెబాబు, రమేష్, శ్రీని వాసులు, సర్దార్, పెరుమాళ్ల హరి, చాన్ బాషా, పాతిమా, సురేష్, గోవర్ధన్, శివ, వూటుకూరు వెంకటరమణయ్య, దాసరిమహేష్, కరుణానిధి, రామిశెట్టి వెంకటేశ్వర్లు, హుమాయన్, విజయ కుమార్, జానకీరాం పాల్గొన్నారు.



బిట్రగుంటలో..

ప్రజాశక్తి-బిట్రగుంట :ప్రభుత్వం విధించే విద్యుత్ ట్రూ అప్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని వ్యవసాయ రాష్ట్ర కమిటీ సభ్యులు తాళ్లూరు మాలాద్రి పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై తల పెట్టిన ప్రజా పోరు కార్యక్రమాన్ని శనివారం బోగోలు మండలం అరుంధతి వాడలో మండల సిపిఎం కార్యదర్శి తుమ్మల వెంకయ్య ఆధ్వర్యంలో గ్రామంలో ఇంటింటికి తిరిగి గ్రామస్తులకు కరపత్రం అదజేశారు. తాళ్లూరు మాల్యాద్రి, తుమ్మల వెంకయ్యలు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పెను బారాన్ని మోపుతున్నా యన్నారు. పి రమేష్, పిశ్రీనివాసులు పాల్గొన్నారు.



వలేటివారిపాలెంలో..

వ్రలేటివారిపాలెం : మండల కేంద్రంలోని వడ్డెపాలెంలో శనివారం సిపిఎం ప్రజాపోరు సాగింది. సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ మాట్లాడారు. ట్రూ అప్ ఛార్జీల పేరుతో 6400కోట్ల చంద్రబాబు ప్రభుత్వం ప్రజలపై వేసిందని విమర్శించారు. సిపిఎం మండల నాయకులు ఎస్ చెన్నకేశవులు, దార్ల మాధవరావు, ఎం లాజరు, స్థానికులు తమ్మిశెట్టినాగమ్మ, రాములమ్మ,యిర్ల కొండమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు



గుడ్లూరు మండలంలో..

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సిపిఎం తలపెట్టిన ప్రజా పోరు గుడ్లూరు మండలంలో రెండో రోజుకు చేరుకుంది. శనివారం చెంచు రెడ్డిపాలెం బసిరెడ్డి పాలెం సీతారాంపురం గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి కుడికాలువకు నీరు విడుదల చేసి దిగువ గ్రామాలైన చెంచు రెడ్డిపాలెం వెంకంపేట, పూరేటిపల్లి, దారకానిపాడు, గుళ్ళ పాలెం గ్రామాలకు నీరు చేరే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం గుడ్లూరు ఏరియా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సిపిఎం గుడ్లూరు శాఖ కార్యదర్శి గుత్తి స్టాలిన్, సిపిఎం నాయకులు దామా కష్ణయ్య, పాలకుర్తి నాగేశ్వరరావు, కొప్పోలు నారాయణ, బీరకాయల వెంకటేశ్వరరావు, రైతులు పాపిరెడ్డి నర్సారెడ్డి, మహిళలు మార్తాల రమణమ్మ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొండి వైఖరి వీడాలి

ప్రజాశక్తి-దుత్తలూరు :కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొండి వైఖరి వీడి రాష్ట్ర ప్రజల అభివృద్ధి క్షేమం కోసం నడపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. శనివారం సిపిఎం ప్రాంతీయ కమిటీ మహాసభ దుత్తలూరు కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంతీయ కార్యాలయంలో మండల మహాసభ జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేసి నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం ప్రయివేటీకరణ ఉద్యోగుల తొలగింపును విరమించు కోవాల న్నారు. మహిళలు, మైనారిటీలు దళితులపై దాడులు అత్యాచా రాలను అరికట్టాలని, పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించి ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే జెమిలీ ఎన్నికల ప్రతిపాదన విరమించుకోవాలన్నారు. కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ ను వెంటనే పునరుద్ధరించి సోమశిల హైలెవల్ కెనాల్ పనులకు బడ్జెట్లో నిధులు కేటాయించాలన్నారు. రామాయపట్నం పోర్టు పనులు వెంటనే పూర్తిచేసి కార్యకలాపాలు ప్రారంభించి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అనంతరం 11 మంది కమిటీ సభ్యులతో ఏరియా శాఖ నూతన కార్యదర్శిగా గుజ్జుల మల్లికార్జునను ఏకీగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా అమరవీరులను స్మరించుకొని ఘన నివాళులు అర్పించారు. అనంతరం సిపిఎం జెండా వందనం చేశారు.జిల్లా కార్యవర్గ సభ్యులు మూలి వెంగయ్య, పార్టీ సభ్యులు స్వరాజ్ బాబు, సింహాద్రి, దుత్తలూరు, వింజమూరు, కలిగిరి శాఖ కార్యదర్శులు సభ్యులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఎంఎల్‌ఎ 'ఇంటూరి' చొరవపై హర్షం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు ఓవి రోడ్లో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి చర్యలు ప్రారంభమయ్యాయి. ఓవి డోడ్లుఓని సిటీఆర్‌ఐ వద్ద నుంచి గాయత్రి కాలేజ్ వరకు రోడ్డు ఇరుకుగా ఉండటం, రోడ్డు కిరువైపులా చెట్లు ఉండడంతో రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. దీంతో నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. బ్రిటిష్ కాలంలో రోడ్డు కిరువైపులా చెట్లు నాటారు. దశాబ్దాల కిందట నాటిన చెట్లు మానులుగా తయారై రోడ్డుపై రాకపోకలకి అడ్డంకులుగా ఉన్నాయి. ఈ రోడ్డులో నెలలో ఒకటి రెండు రోడ్డు ప్రమాదాలు జరిగి చనిపోవడం, గాయపడటం జరుగుతోంది. రోడ్డు ప్రమాదాలకు ఈ చెట్లే ప్రధాన కారణమని అందరికీ తెలిసినప్పటికీ వాటిని తొలగించడానికి మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కందుకూరు పట్టణానికి ఆనుకొని కొత్తగా జాతీయ రహదారి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి. ఓవి రోడ్డు లోని మాల్యాద్రి కాలనీ వద్ద జాతీయ రహదారి కలుస్తోంది. జాతీయ రహదారి కలిసే ప్రాంతం నుంచి కందుకూరు కు వచ్చే రోడ్డు లోని ఇరువైపులా ఉన్న చెట్లను తొలగించి రోడ్డు ప్రమాదాలను నివారించాలనే ఆలోచన శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు చేశారు. రోడ్లు భవనాల శాఖ అధికారులతోమాట్లాడారు. ఎట్టకేలకు చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు. రోడ్డు విస్తరణకు ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించడానికి ఆయన ప్రయత్నాలు కూడా ప్రారంభించారు.



రోడ్డు ప్రమాదాలకు కారణమైన చెట్లను తొలగిస్తున్న దృశ్యం



అదాని కృష్ణపట్నం పోర్టుకు అవార్డు ప్రదానం చేస్తున్న గల్లా అరుణకుమారి

అవార్డు ప్రదానం

ప్రజాశక్తి - తోటపల్లిగూడూరు :ఆదాని కష్ణపట్నం పోర్టుకు సస్టైన్స్ ఆర్గనైజేషన్ అవార్డు దక్కింది. అవార్డును పోర్టు సిఇఒ జగదీష్ పటేల్ శనివారం అందుకొన్నారు. క్వా లిటీ సర్కిల్ ఆఫ్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యూసిఎఫ్ఐ) తిరుపతి ఆధ్వర్యంలో శనివారం ఆదాని కష్ణపట్నం పోర్టుకు సస్టైన్స్ ఆర్గనైజేషన్ అవార్డును పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ కు తిరుపతిలో అందించారు. నాణ్యమైన కాన్సెప్ట్‌లపై 10వ వార్షిక కన్వెన్షన్ సమావేశం లో మాజీ మంత్రి గల్లా అరుణ కుమారి అదాని కష్ణపట్నం పోర్టుకు ప్రతిష్టాత్మకమైన అవార్డును అందజేశారు. సిద్ధార్థ కుమార్ సారంగి, డిప్యూటీ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్స్) వివేక్ నారాయణన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాతీయ న్యాయ సేవల దినోత్సవం

ప్రజాశక్తి-కందుకూరు

స్థానిక టిఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని నేషనల్ సర్వీస్ స్కీమ్, రాజకీయ శాస్త్ర విభాగం,మహిళా సాధికారత విభాగాలు కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి సంయుక్తగా "ఉచిత న్యాయ సహాయం" అనే ఇతివత్తంతో 'జాతీయ న్యాయ సేవల దినోత్సవం' శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్ అధ్యక్షత వహించారు. కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి , చైర్మన్ ఏ. శోభారాణి ముఖ్య అతిథిగా, కందుకూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు చెనికల రమేష్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ కె. హెచ్.కోటేశ్వరరావు, కందుకూరు బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.సంపత్ కుమార్ అతిథులుగా హాజరయ్యారు.ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవి కుమార్ జాతీయ చట్ట సేవల దినోత్సవం యొక్క ప్రాముఖ్యత, పౌరులకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయం గురించి అవగాహన పెంచడంలో దాని పాత్రను వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి ఏ. శోభారాణి ఉచిత చట్ట సహాయం యొక్క భావన,పౌరులకు అందుబాటులో ఉన్న వివిధ చట్టపరమైన సేవల గురించి వివరించారు.చెనికల రమేశ్ మాట్లాడుతూ చట్టపరమైన ప్రాతినిధ్యం న్యాయవాదుల నిబద్ధత గురించి విలువైన సమాచారాన్ని పంచుకున్నారు..కె హెచ్ కోటేశ్వర రావు ప్రసంగిస్తూ ప్రభుత్వం అందించే చట్ట సహాయ చర్యలు వివరించారు, .పి. సంపత్ కుమార్ మాట్లాడుతూ ఏదైనా చట్టపరమైన సమస్య యొక్క ప్రారంభ దశలోనే చట్టపరమైన సలహా తీసుకోవడం ముఖ్యమని చెప్పారు.అనంతరం ముఖ్య అతిథులు విద్యార్థులతో ప్రశ్నోత్తరాలు నిర్వహించారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని, వివిధ న్యాయ సేవల గురించి ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. రాజనీతి శాస్త్ర అధ్యాపకులు, ఎన్ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ కోటపాటి నరేష్ రాజా, తెలుగు అధ్యాపకులు, మహిళా సాధికార విభాగం కోఆర్డినేటర్ షానాజ్ బేగం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి శోభారాణి

ల్యాబ్ టెక్నిషియన్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఎన్‌యుహెచ్‌ఎం విభాగంలో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నిషియన్, ఫార్మసిస్టు పోస్టులు డిఈఓ, ఎల్‌జిఎస్ అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపట్టేందుకు అర్హులైన వారు ఈ నెల 13న దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ఎం.పెంచలయ్య పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

సందాని బేగంకు రాష్ట్రస్థాయి అవార్డు

ప్రజాశక్తి-ఉదయగిరి
సందాని బేగంకు రాష్ట్రస్థాయి ఉర్దు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంపై జిల్లా ఉర్దూ పాఠశాల సంఘాలకులు షేక్ ఖాజా మొహిద్దీన్ ఉదయగిరి మండల ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ స్థానిక ఉదయగిరి నార్త్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని పి.సందాని బేగం కు రాష్ట్ర స్థాయి ఉర్దు ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుకు ఎన్నిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు 2024 సంవత్సరం కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ విజయవాడ ఉర్దూ అకాడమీ వారు జాతీయ విద్యా వాత్సవం నవంబరు 11న విజయవాడ లోని తుమ్మల పల్లి కళాక్షేత్రం లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ద్వారా అందుకుంటారన్నారు. గతంలో 2016 సంవత్సరం మండల ఉత్తమ ఉపాధ్యాయిని గాను 2024 సెప్టెంబర్ 5న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కలెక్టర్ ఓ ఆనంద్ ద్వారా అవార్డును అందుకున్నారు. ప్రాథమిక విద్యలో పిల్లలకు సరళమైన విద్యను బోధించే మెలకువలను ప్రదర్శిస్తున్న కారణంగా రాష్ట్ర జిల్లాస్థాయి ఉర్దూ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లు ఆమెకు సొంతం చేసుకున్నారన్నారు. ఇలాంటి అవార్డులు మరెన్నో అందుకోవాలని వారు ఆకాంక్షించారు.

రీచ్‌ల్లో మంత్రి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
రాష్ట్ర ప్రజల జీవన స్థితిగతులు మారడానికి ఉచిత ఇసుక విధానం ఎంతగానో తోడ్పడుతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం నెల్లూరులోని భగత్ సింగ్ కాలనీ, దీన్ దయాళ్ నగర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఇసుక రీచ్ లను అధికారులతో కలిసి పరిశీలించి అక్కడ ఉన్న కార్మికులతో మంత్రి నారాయణ ముచ్చటించి, వారి స్థితిగతులు తెల్సుకుని, వారితో కలిసి పారతో ఇసుక తీసి వారి శ్రమలో భాగమయ్యారు. నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి తీసుకువచ్చిన ఉచిత ఇసుక విధానంతో రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులకు ఉపాధి దొరికిందన్నారు. నిర్మాణ రంగం ఉపందుకుంటే, దానిమీద ఆధారపడిన వివిధ రకాలైన కార్మికులకు నిరంతర పని ఉంటుందన్నారు. దాంతో వారి ఆర్థిక స్థితి మెరుగుపడటమే కాకుండా రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు దోహదపడుతుందన్నారు. ప్రతి ఒక్కరికి పని కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1100/- లకు చేరిందని, ఇసుక ను మరింత అందుబాటులోకి తీసుకువచ్చి రూ.900/- లకు చేరే విధంగా చర్యలు తీసుకుంటా మన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒకదాని తర్వాత ఒకటి అన్ని నెరవేర్చుతామన్నారు. ఇసుకను దొంగ దారిలో ఇతర రాష్ట్రాలకు తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే ముఖ్యమంత్రి అందరు ఎస్పీలకు తగు ఆదేశాలు ఇచ్చారన్నారు. మంత్రి వెంట నెల్లూరు ఆర్డీఓ అనూష , ఇతర అధికారులు, నాయకులున్నారు.



పిహెచ్‌డి గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-బిట్రగుంట
బోగోలు మండలం, కడనూతల గ్రామంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఐసిఇ డిపార్ట్మెంట్లో అధ్యాపకురాలుగా పనిచేస్తున్న పి.ఝాంచావనికి జేఎన్టీయుఏ అనంతపురం యూనివర్సిటీ వారు పిహెచ్.డి అవార్డును అందజేసినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వివిన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జెఎన్‌టియు యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా పని చేస్తున్న డి.విష్ణు వర్ధన్ సూపర్విజన్లో ఆప్టిమైజేషన్ ఆఫ్ పవర్ అండ్ ఏరియా ఎఫిషియన్ట్ ఈఈ జీ సిగ్నల్ ఆక్విజి షన్ సిస్టంపై థీసిస్ సమర్పించగా యూనివర్సిటీ వారు పిహెచ్‌డి గ్రీని ప్రధానం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం శనివారం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్ వి ,రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ వి.సునీల్ రెడ్డి అన్ని విభాగాల అధిపతులు అధ్యాపకులు ఆమెను ఘనంగా సన్మానించారని తెలిపారు.

బిల్లులు లేని మొబైల్ ఫోన్లను కొనుగోలు చేయొద్దు

ప్రజాశక్తి-బిట్రగుంట
బిల్లులు లేని ఫోన్లను కొనుగోలు చేయొద్దని బిట్రగుంట ఎస్ఐ బొజ్జ పేర్కొన్నారు. శనివారం బిట్రగుంట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మీ స్నేహితుల వద్ద గాని, గుర్తు తెలియని వ్యక్తుల వద్ద గాని మొబైల్ ఫోన్ కొనుగోలు చేయకండి. సరైన పత్రాలు బిల్లు చార్జర్ లేకుండా ఎటువంటి మొబైల్ ఫోను తక్కువ ధరకు వస్తుందన్నారు. ఆశపడి మొబైల్ ఫోన్ కొనుగోలు చేసిన నష్టాలతో కష్టాలు తప్పవని తెలిపారు. బిల్లులు లేని మొబైల్ అన్ని దొంగతనం చేసి తక్కువ ధరలకు ఇస్తామని, అమాయక ప్రజలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని, వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎవరైనా బిల్లులు లేని సెల్ ఫోన్లు, సరైన పత్రాలు లేని వాహనాలు అమ్ముతున్న మీ గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న మీ దృష్టికి వస్తే స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ,పోలీస్ స్టేషన్ నెంబర్ 08626-246233, గాని 9440 796 338 కు సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన పేర్లు గొప్పంగా ఉంచుతామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగుండాలి

ప్రజాశక్తి-ఉదయగిరి
18 సంవత్సరాల నుంచి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండేందుకు దరఖాస్తులు స్వీకరించిన బిఎల్వోలు ఈ సందర్భంగా మండలంలోని 36 పోలింగ్ కేంద్రాల్లో శనివారం ప్రత్యేక ఎన్నికలపై ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కేంద్రాల వద్ద బూత్ లెవెల్ అధికారులు పాల్గొని ఓటర్ల నుంచి ఫారం 6, 7, 8 అందుబాటులో ఉంచుకుని కొత్త వారి నుంచి ఓటు హక్కు చేర్చుకోవడం జరిగిందన్నారు. మార్పులు చేర్పులు తొలగింపులు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించారు. ముఖ్యంగా గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఓటర్ల వివరాలు సంబంధిత ఆధారాలతో ఫారం లో పూర్తి చేసి బిఎల్ఒలను సంప్రదించాలని కోరారు.



ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జి. శివాన్నారాయణ

సమగ్ర పోషక యాజమాన్య అంశంపై శిక్షణ

ప్రజాశక్తి-మర్రిపాడు
ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యం అంశంపై సమేతి మేనేజ్ సంయుక్త ఆధ్వర్యంలో 15 రోజుల శిక్షణ కార్యక్రమం 6వ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జి. శివాన్నారాయణ పాల్గొని మాట్లాడుతూ కొన్నేళ్లుగా అధిక దిగుబడి కోసం రైతులు విచక్షణారహితంగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుతున్నారన్నారు. ఫలితంగా భూసారం దెబ్బతింటున్నదని, పర్యావరణం సైతం కలుషితమై ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఈ సమస్యలకు పరిష్కారం సేంద్రియ ఎరువులు వాడడమేనని తెలిపారు. నేల ఆరోగ్యం క్షీణించడానికి గల కారణాలు తెలిపారు. కృత్రిమ ఎరువుల కారణంగా కోల్పోయిన భూసారాన్ని తిరిగి సారవంతం చేయటంలో సేంద్రియ ఎరువులు కీలకపాత్ర పోషిస్తాయని వ్యవసాయ వ్యర్థాలను వానపాముల సహాయంతో కుళ్లబెట్టి వర్మి కంపోస్ట్ ను ఉత్పత్తి చేసుకోవాలన్నారు. సుస్థిర వ్యవసాయంలో సేంద్రియ వ్యవసాయం ఆవశ్యకత గురించి తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు, పంటల ఉత్పత్తి విభాగ శస్త్రవేత డా. కె. కిరణ్ కుమార్ రెడ్డి పచ్చిరొట్ట పైర్ల పెంపకం - ప్రయోజనాలు, సేంద్రియ ఎరువులు తయారు చేసుకునే పద్ధతులు వివరించారు.

రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి
రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని, అక్రమ కేసులతో బయపడే ప్రశ్నేలేదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంఎల్‌ఎ. పి. చంద్రశేఖర్‌రెడ్డిలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం నెల్లూరు డైకాస్ రోడ్డులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డితో ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. టిడిపి నేతలు ఆంధ్రప్రదేశ్ లో అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాదని రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ.. రాజ్యాంగ విలువలను అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో టిడిపి నేతలు.. ప్రజల కోసం పోరాడుతున్న వైసిపి నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తూ.. వేధింపులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలపై టిడిపి నేతలు పెడుతున్న అక్రమ కేసులను ప్రజలు గమనిస్తున్నారని.. వారికి తగిన బుద్ధి చెప్తారని అన్నారు. అర్ధరాత్రి వైసీపీ కార్యకర్తల ఇళ్లల్లోకి చొరబడి అక్రమంగా అరెస్టు చేయడం.. చూస్తుంటే ఈ సమాజం ఎటు పోతుందోనన్న అభద్రతా భావం లోకి ప్రజలు వెళ్లిపోతున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందినవారు ఇష్టా రాజ్యాంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే.. వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ కి సంబంధించిన వారికి ఒక నీతి.. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి చెందినవారికి మరో నీతి అమలు చేయడం సరికాద న్నారు. తెలుగుదేశం పార్టీ ఇలాంటి ధోరణినినే అవలంభిస్తే మాత్రం.. ప్రజలు శాశ్వతంగా ఆ పార్టీని దూరం పెడతార న్నారు., . జిల్లా ఎంతో శాంతియుతంగా ఉంటుందని అందరూ చెప్తారని, ఈ జిల్లాలో కూడా అధికారులు ఒకవైపునే పనిచేస్తుండడం సరికాదన్నారు. ఇదే దోరణిలో అధికారులు వ్యవహరిస్తే.. ఎన్నికలు త్వరలోనే వస్తాయని.. అప్పుడు వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత.. తప్పు చేసిన అధికారులు చట్టం నుంచి తప్పించుకోలేరని అన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి

ప్రజాసమస్యల పరిష్కారానికి సిపిఎం పోరుబాట


ప్రజాశక్తి-నెల్లూరు
ఎన్నికల ప్రచారంలో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు ఆర్భాటంగా ప్రజలకు చేసిన హామీలను అమలు చేయాలని, అధికారంలోకి వచ్చిన అనంతరం ఐదు నెలల కాలం హామీలు అమలు చేస్తారన్న ఆశతో ఎదురు చూశామని, హామీలు అమలుకు నోచుకోకపో వడంతో సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో ప్రజా పోరు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అధికారంలోకి రాకముందు టిడిపి నాయకులు చేసిన హామీలు, అధికారంలోకి వచ్చిన తరువాత వారు అవలంభిస్తున్న విధానం వల్ల ప్రజలకు కలిగే నష్టాన్ని వివరించి ప్రజా పోరు పేరుతో చైతన్య పరిచే కార్యక్రమానికి సిపిఎం శ్రీకారం చుట్టింది. ఆరు రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి 14వ తేదిన మండల తహశీల్దార్ల కార్యాలయాలు, కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ఆధ్వర్యంలో, ప్రజల మద్దతుతో మహాధర్నా కార్యక్రమం నిర్వహించేందుకు సన్నాహకాలు ప్రారంభించింది. ముఖ్యంగా నిరుద్యోగ భృతి చెల్లించాలని, ఉచిత ఇసుక, నిరుద్యోగ సమస్య, వాడవాడలా బెల్టుషాపులు, నిరుద్యోగం, నిత్యావసర వస్తువుల ధరలు, కృష్ణపట్నం పోర్టు కంటైనర్ తిరిగి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ట్రూ ఆప్ చార్జీల పేరుతో కరెంటు ఛార్జీలు వసూళ్లు చేస్తూ ప్రజలపై ఆర్థిక భారాలు మోపే ఆలోచన విరమించుకోవాలన్న ప్రధానమైన డిమాండ్లతో ప్రజల ముందుకు సిపిఎం వెళ్తుంది.

వీక్షణం

రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పదవుల పంపకంలో జిల్లాకు చెందిన ముగ్గురు టిడిపి నాయకులకు పదవులు దక్కడం, కూటమి ప్రభుత్వంలోని బిజెపికి చెందిన మరోక నాయకుడికి నామినేటెడ్ పదవి దక్కడంతో ఆనాయకుల అనుచరులు ఆనందంతో సంబరాలు జరుపుకుంటున్నారు. రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి సారిగా నగరంలోని నూతన జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించిన డిఆర్‌సి సమావేశం అధికార పార్టీకి చెందిన నాయకులు ప్రజా సమస్యలపై అధికారులను నిలదీశారు. ఇదిలా ఉండగా ఆ సమావేశానికి హాజరైన ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పట్ల అధికారులు వ్యవహరించిన తీరు (ప్రోటోకాల్ వ్యవహారం) తీవ్ర మనస్థాపానికి గురి కావడంతో సభ నుంచి అర్ధాంతరంగా వెనుతిరిగి వెళ్ళి పోయారు. ఆ సమయంలో అధికార పార్టీకి చెందిన మంత్రులు, శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి సర్దిచెప్పాలని ఎంత ప్రయత్నించినా లాభం లేకుండా పోయింది. ఈ వ్యవహారం అంతా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్ చూస్తుండగానే చోటు చేసుకుంది. ఇదిలా ఉండగా కార్పోరేషన్ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పట్ల సభామర్యాదలు పాటించకపోవడంతో సదరు ఎంఎల్‌సి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మేయర్‌కు సభకు విచ్చేసిన సభ్యుల పట్ల సభామర్యాదలు పాటించాలని, వాటిని విస్మరించడం మంచిది కాదు అని అంటూ మెల్లగా చురకలు అంటించారు. ఐఏబి సమావేశంలో ఎటువంటి ప్రోటోకాల్ సమస్యలు తలెత్తకుండా సజావుగా సాగిపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

'నారాయణ'లో 'సినాప్స్ న్యూరో క్లినిక్స్ సదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు: నారాయణ మెడికల్ కాలేజిలోని గ్రేస్ గ్యాలరీలో సినాప్స్ న్యూరో క్లినిక్స్ 2024 రాష్ట్ర సదస్సు శనివారం ప్రారంభమైంది. నెల్లూరు న్యూరో క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సదస్సుకు నారాయణ హాస్పిటల్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎన్.ఎస్ సంపత్ కుమార్ అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ నాడీ సంబంధిత వైద్య విజ్ఞానాన్ని, అవిష్కరణలను పెంపొందించుకునేందుకు రూపొందించబడిన సదస్సును ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది నెల్లూరు న్యూరో క్లబ్ ఆధ్వర్యంలో నారాయణ మెడికల్ కళాశాలలో రెండు రోజుల పాటు జరపునున్నట్లు తెలిపారు. పాల్గొన్న ప్రతి ఒక్కరికి క్లినికల్ నైపుణ్యంతోపాటు అకడమిక్ ఎక్సలెన్స్ పెంపొందించుకునేందుకు, సీనియర్ల అనుభవాలను , ఆలోచనలను పంచుకునేందుకు, న్యూరో సైన్సెస్లో తాజా పురోగతి గురించి తెలుసుకునేందుకు ఇది ఒక చక్కటి వేదిక అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్య అతిథులుగా నారాయణ వైద్య విద్యాసంస్థల కో-ఆర్డినేటర్ డాక్టరు బిజు రవీంద్రన్, నారాయణ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు పి. శ్రీనివాసులరెడ్డి. నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టరు బి. హరిప్రసాద్ రెడ్డిలు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టరు రమణమూర్తి, డాక్టరు బి. శ్రీనివాసుల రెడ్డి, డాక్టరు పి. శ్రీనివాసుల రెడ్డిలు పాల్గొన్నారు. దేశ నలుమూలల నుంచి న్యూరాలజిస్టు, న్యూరోసర్జన్లు వైద్య విద్యార్థులు సుమారు 300 మందికి పైగా పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

పలు కార్యక్రమాలలో 'కావ్య'.

ప్రజాశక్తి బిట్రగుంట. బోగోలు మండలం నాగులవరంకు చెందిన తెలుగుదేశం నాయకుడు గుంపర్లపాటి రమేష్ - మానస దంపతుల కుమార్తె మనీషా నలుగు కార్యక్రమానికి కావలసిన సభ్యుడు కావ్య కష్ణారెడ్డి శనివారం పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. ఆయనతో మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, మాజీ సోమశిల డైరెక్టర్ కండ్లగుంట మధుబాబు నాయుడు, మాజీ ఎంపీటీసీ చిలకపాటి వెంకటేశ్వర్లు,నాయకులు కార్యకర్తలు తదితరులున్నారు.

విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
ఆత్మకూరు ప్రభుత్వ రెసిడెన్షియల్ బాలికల విద్యాలయంలో శనివారం విద్యార్థినీ విద్యార్థులకు సిఐ గంగాధర్, ఎస్ఐ జిలానీలు బహుమతులు అందించారు.పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా డి.ఎస్.పి వేణుగోపాల్ ఆదేశాల మేరకు ఆత్మకూరు మండల స్థాయిలో చిత్రలేఖనం, వ్యాసరచన, వకత పోటీలను సీఐ గంగాధర్ నేతత్వంలో ఎస్సై జిలానీ పర్యవేక్షణలో జరిగిన ప్రతిభ పోటీలలో మండలంలోని పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన 25 మందిని ఎంపిక చేసి బహుమతి ప్రదానం చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిఐ గంగాధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యూనిఫామ్ లేని పోలీసులేనని అవినీతి, అక్రమాలను అడ్డుకోవాల్సిన బాధ్యత ఉందని తెలిపారు.ప్రతి ఒక్కరు సెల్ ఫోన్ కు దూరంగా ఉండాలని సెల్ఫోన్ మనకు తెలియకుండానే ప్రభావితం చూపుతోందని మనం నేర పరిధిలోకి వెళ్ళకుండా ఉండాలంటే సెల్ ఫోన్ ను అవసరమేరా వాడాలని మన ఆలోచనలకు, సాక్షిగా సెల్ఫోన్ నిలుస్తుందని సెల్ఫోన్ వాడుతున్న అమ్మాయిలు, అబ్బాయిలు వారి సెల్ లాక్ లో ఉందంటే తల్లిదండ్రులు అప్రమత్తంగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎస్సై జిలాని మాట్లాడుతూ మనకు తెలియకుండానే సెల్ ఫోన్ ప్రభావములో ఉన్నామని మనల్ని దశా దిశాను సెల్ఫోన్ నిర్ధారిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థిని, విద్యార్థులు, యువతీ యువకులు వారి జ్ఞానాన్ని పెంచుకోవడానికి సెల్ఫోన్ వాడకం ఉండాలని సెల్ ఫోన్ కి బానిస కాకూడదని తెలిపారు.కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జడ్పీహెచ్ చెర్లో ఎడవల్లి ఉపాధ్యాయుల అజీజ్, శ్రీనివాస కళాశాల కరస్పాండెంట్ సురేష్ బాబు, రాష్ట్ర నాయకులు కేసికిష్టయ్య, శ్రీ గాయత్రి కళాశాల ప్రిన్సిపల్ పద్మ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి-కావలి
రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవూరు దేవకుమార్ రెడ్డి ఆదేశాలమేరకు కావాలి నియజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పొదలకూరి కళ్యాణ్ ఆధ్వర్యంలో ఎన్.డి.ఏ.కూటమి పెంచిన విద్యుత్ ఛార్జిలు వెంటనే తగ్గిచాలని శనివారం కాంగ్రెస్ శ్రేణులు కావలి విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర ధర్నా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎల్.సురేష్ బాబు మాట్లాడుతూ కూటమి అధికారం లోకి రాక ముందు విధ్యుత్ ఛార్జిలు తగ్గిస్తా మని, అధికారం లోకి వచ్చిన మూడునెలల తరువాత రాష్ట్ర ప్రజలపై 17000 కోట్లు భారం మోపడం సమంజసం కాదన్నారు.

మార్కెట్ ను అభివృద్ధి పరుస్తా

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం
పట్టణంలోని కూరగాయల మార్కెట్ ను ఆధునికరించి అభివృద్ధి చేస్తానని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో పలుచోట్ల శనివారం చైర్ పర్సన్ మోర్ల సుప్రజా తో కలిసి ఆమె పర్యటించారు.ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్లోని వ్యాపారులతో మార్కెట్ గురించి పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు.
కూరగాయల మార్కెట్ ఆధునికరించి ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి కొనుగోలుదారులకు కావలసిన సరుకులన్నీ ఒకే చోట దొరికే విధంగా చేస్తానన్నారు. వివేకానంద హై స్కూల్ పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. పార్కు నిర్మాణానికి నిమిత్తం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి 10 లక్షల రూపాయలు నిధులు మంజూరు చేసి ఉన్నారని ఆమె తెలిపారు. నగర పంచాయతీలో ప్రభుత్వ స్థలాలను గుర్తించి కబ్జాదారులకు గురికాకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాల న్నారు. అనంతరం వివేకానంద హై స్కూల్ లోని బాల బాలికలతో కాసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట నగర పంచాయతీ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, రూరల్ బత్తల హరికష్ణ,పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, కౌన్సిలర్లు, నాయకులు, పలువురు పాల్గొన్నారు.


కరపత్రాలు పంచుతున్న దృశ్యం

టూ అప్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలి

ప్రజాశక్తి-కావలి.
సిపిఐ ఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రెండవ రోజైన శనివారం పట్టణంలోని 18 వ వార్డు పొట్టి శ్రీరాములుస్కూలు, లంబోధర్ క్యాటరింగ్ ఏరియాల లో కరపత్రాలను పంచుతూ సిపిఎం నాయకులు ప్రచారాన్ని కొనసాగించారు.ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పసుపులేటి పెంచలయ్య, వై కష్ణమోహన్, జి.మధుసూదనరావులుమాట్లాడుతూ,ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా అధికారం లోకి వచ్చిన ఐదు నెలలకు ట్రూ ఆప్ సర్దుబాటు కరెంటు చార్జీలు 6,072 కోట్లు ప్రజలపై భారం మోపుతుందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా 11 వేల కోట్లు విద్యుత్తు చార్జీలభారం వేయాలను కుంటుందని దీనివలన విద్యుత్ చార్జీల భారం వినియోగదారులపై ఒక యూనిట్ 1.80 పైసల నుండి 2.40 పైసల వరకు అదనపు భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పి.శీనయ్య, కె.చెన్నయ్య తో పాటు సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

వేళాపాళాలేని మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి-కావలి.
కావలి పట్టణంలో వెంకటేశ్వర థియేటర్ సమీపంలో గల "సూర్య బార్ అండ్ రెస్టారెంట్"లో శనివారం తెల్లవారుజామున 7గంటలకు యధేచ్ఛగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మాములుగా ఉదయం 11నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యం అమ్మకాలు జరగాల్సి ఉంది.ఉదయం 7 గంటలకే అమ్ముతున్నారని సమాచారం అందుకొని మీడియామిత్రులు అక్కడికి చేరారు. బారు లో పనిచేస్తున్న సిబ్బంది, మద్యం తాగుతున్న వారిని అక్కడి నుండి హుటాహుటిన పంపించివేసి, బారుకు తాళాలు వేసుకొని అక్కడి నుండి పరారయ్యారు. ప్రభుత్వం మద్యం దుకాణాలు నడుపుకోవడానికి నిర్ణిత సమయం కేటాయించిన అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ఇష్టా రాజ్యంగా అమ్మకాలు సాగిస్తున్నారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరిపిస్తున్న, అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.ఎక్సైజ్ సిఐ ను వివరణ కోరగా మేము రైడ్ చేసినప్పుడు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడితే తప్ప కేసులు పెట్టడానికి కుదరదన్నారు. మా దష్టికి వచ్చింది కాబట్టి ఇకనుండి పర్యవేక్షణ చేపడతామని చెప్పడం పలు అనుమానాలకు తావిస్తుంది.ప్రజల శ్రేయస్సు కోరే ఎంఎల్ఎ మద్యం అమ్మకాల సమయాన్ని కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


సభ్యత్వాలు తీసుకుంటున్న దృశ్యం

పలుచోట్ల టిడిపి సభ్యత్వ నమోదు...

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్
:రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనా రాయణరెడ్డి సూచనలతో మున్సిపల్ పరిధిలో తెలుగుదేశం పార్టీ నాయకులు పలు వార్డుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తు న్నారు. మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో టీడీపీ నాయకులు నలిశెట్టి శ్రీనివాసులు, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు , షేక్ మహబూబ్ బాష, నలబోతుల వెంకటేవ్వర్లు, మల్లికార్జునయాదవ్, షేక్ నజీర్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మకూరు మున్సిపాల్టీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ తోడేటి వెంకట యాదవ్ ఆధ్వర్యంలో టిడిపి సభ్యత కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఆత్మకూరు మున్సిపాల్టీ టిడిపి బీసీ నాయకులు వంటేరు మల్లికార్జున యాదవ్, మహిళా నాయకురాలు సునీతమ్మ పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-కావలి
కావలి పట్టణం జెండా చెట్టు సమీపంలోని నాగూరు మీరా స్వాములు వారి గంధమహోత్సవ కరపత్రాన్ని కావలి శాసనసభ్యులు కృష్ణారెడ్డి శనివారం ఆవిష్కరించారు. డిసెంబర్ 11వ తేదీ బుధవారం కావలి పట్టణంలో వైభవంగా ఈ గంధ మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముస్లిం మత పెద్దలు ఎమ్మెల్యేకు తెలిపారు. డిసెంబర్ 2వ తేదీ సోమవారం చంద్ర దర్శనం సందర్భంగా సాయంత్రం గంధ మహోత్సవ ఆచార సాంప్రదాయం మేరకు గోమ్ (జెర్రి)జెండా ఊరేగింపు జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమానికి తప్పక విచ్చేయాలని ఎమ్మెల్యేని వారు కోరారు.

మొక్కుబడిగా మండల సమావేశం...,

ప్రజాశక్తి-మర్రిపాడు: స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో సాధారణ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంగవరపు లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. గ్రామాల్లోని సమస్యలు అభివృద్ధిపై చర్చించేందుకు అవకాశం ఉన్న తూర్పు మంత్రంగా నిర్వహించి తూతూ మంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు.

చెట్లు తొలగించరూ..

ప్రజాశక్తి - గుడ్లూరు రూరల్ :ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఐదు నుంచి ఆరడుగుల ఎత్తు ఉండే పిచ్చి చెట్లు రోడ్డుకి ఇరువైపులా పెరిగాయి. దీంతో వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. కొత్తపేట నుంచి స్వర్ణజపురం వెళ్లే మలు పులలో భారీ ఎత్తున చెట్లు పెరగడం వల్ల వాహనదారులు మలుపులు తిప్పే సమయంలో ఎదురు వచ్చే వాహనం గుర్తు తెలియకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నా యన్నారు.